పండుగైపాయె.. పల్లెజనం వలసపోయె!

- వలసబాటలో కూలీలు, రైతులు
- ఖాళీ అవుతున్న ఊళ్లు
- ప్రభుత్వ ప్రోత్సాహం కరువాయె

'దసరా పండుగైపోయింది..తట్టా–బుట్టా సర్దుకొని సుగ్గికి పోదాం పదయ్యో.. ఇంటిల్లిపాది పనులు చేస్తే తప్పా ఇల్లు గడిచేటట్లు లేదు.. ఈ ప్రభుత్వం పేదలికిచ్చే పథకాలకు పాతరేసింది.. ఉపాధి చూపే మార్గం మరిచింది.. మన బతుకు లేవో మనమే బతకాలి.. సుగ్గి (వలస)కి పోతే అన్నా పైసాపైసా కూడబెట్టొచ్చు.. ఇంట్లో అందరికీ కూడు పెట్టొచ్చు..' అంటూ పల్లె మహిళలు కన్నీరు పెడుతూ గోడెళ్లబోసుకుంటున్నారు. కష్టమైనా జట్టుకట్టీ మరీ వలసెళ్లిపోతున్నారు. ఇదీ వెనుకబడిన ఆదోని, ఎమ్మిగనూరు డివిజన్లలోని పేదల బతుకు చిత్రం.


ఆటోలో వలస వెళ్తున్న ఏనుగుబాల వాసులు


తెలంగాణకు వసల వెళ్లేందుకు టెంపోలతో సిద్ధంగా ఉన్న మసీదుపురం గ్రామస్తులు

ఎమ్మిగనూరు: ఉపాధి పనుల కోసం పల్లె జనం పట్నంవైపు పరుగులు పెడుతున్నారు. వలస కూలీలను ప్రభుత్వం ఆదుకోలేకపోతోంది. ఆదోని, ఎమ్మిగనూరు డివిజన్ల పరిధిలో ఏ పల్లెకు వెళ్లినా ఇదే పరిస్థితి. అందరిదీ వలసల బాట. వలస పక్షులతో ఆర్టీసీ, రైల్వే స్టేషన్లు కిక్కిరిసిపోతున్నాయి. చంటి పిల్లలు మొదలుకుని చదువుకునే విద్యార్థులను సైతం తల్లిదండ్రులు వెంటబెట్టుకుని వెళ్లిపోతున్నారు. ఎవరిని కదిపినా కన్నీరే.

ఖాళీ అవుతున్న గ్రామాలు

ఎమ్మిగనూరు నియోజకవర్గంలో 52 పంచాయతీలు.. 32 మజరా గ్రామాలు ఉన్నాయి. ప్రధాన జీవనాధారం వ్యవసాయం. వర్షాధారం 18,550 హెక్టార్లు వరకు పంటలు సాగుచేస్తున్నారు. తుంగభద్ర నదికి ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకాలు, గాజులదిన్నె ప్రాజెక్టు, తుంగభద్ర దిగువ కాలువలు ప్రధాన నీటివనరులు. ఈ సారి కూడా ఖరీఫ్ ప్రారంభంలో వర్షాభావం, ఆదును దాటిన తరువాత వానలు వ్యవసాయ రంగాన్ని కుదిపేశాయి. వర్షాభావంతో కొన్ని.. అధిక వర్షాలకు మరికొన్ని పంటల్లు నాశనమయ్యాయి. పెట్టుబడులకు రాని పంటలను చూడలేక రైతన్నలూ వలస బాట పట్టారు. ఉన్న ఊళ్లో పనుల్లేక కూలీ పనులు చేసేందుకు వలసబండినెక్కక తప్పని పరిస్థితి.

వలసలకు పల్లెలు పోటీ

వ్యవసాయ పనులు తగ్గిపోవటం.. ఉపాధి పనులు కరువై పల్లెలన్నీ పోటీ పడుతున్నట్లు వలసలతో ఖాళీ అవుతున్నాయి. ఇప్పటికి నందవరం మండలంలోని పూలచింత, ముగతి, మాచాపురం, మిట్టసోమాపురం, నందవరం, నాగలదిన్నె, కనకవీడు, టి సోమలగూడూరు, హాలహర్వి గ్రామాల నుంచి 3వేల మందికి పైగా వలసవెళ్లారు. ఎమ్మిగనూరు మండలంలోని ఏనుగుబాల, దైవందిన్నె, తిమ్మాపురం, గార్లదిన్నె, పార్లపల్లె, పెసలదిన్నె, కడివెళ్ల, కందనాతి, టీఎస్ కూళూరుల నుంచి 4వేల మందికిపైగా వలసపోయారు. గోనెగండ్ల మండలంలోని పెద్దమర్రివీడు, గాజులదిన్నె, అగ్రహారం, బైలుప్పుల, గంజహళ్లి, వేముగోడు, ఈరంపల్లె, తిప్పనూరు గ్రామాల నుంచి 3వేల మందికి పైగా సుగ్గిబాట బాట పట్టారు. వీరు వరంగల్, గుంటూరు, బెంగళూరు, హైదరాబాద్, ముంబాయి ప్రాంతాలకు వెళ్తున్నారు.

ఆదుకోని ఉపాధి హామీ పథకం

వలస కూలీలను ఉపాధి హామీ పథకం ఆదుకోలేకపోతోంది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి ఉపాధి పనులను పూర్తిస్థాయిలో చేపట్టకపోవడంతో వలసలు పెరిగాయి. ఉపాధి నిధులన్నీ ఇతర పనుల పేరుతో తమ్ముళ్లు దోచుకుంటున్నారు. ఇక గత ప్రభుత్వంలో పేదలందించే సంక్షేమ పథకాల ఫలాలన్నింటినీ కూటమి ప్రభుత్వం కూకటివేళ్లతో పెకిలించింది. అద్భుత పథకాలు అందిస్తామంటూ ఆశలుచూపి పేదబతుకులను చివరకు 'సుగ్గి'పాలు చేస్తోంది.

కొనసాగుతున్న వలసలు..

పెద్దకడబూరు : మండలంలో వలసలు కొనసాగుతున్నాయి. మంగళవారం మండల పరిధిలోని మేకడోణ గ్రామానికి చెందిన వాల్మీకి కుటుంబాలు పిల్లాపాపలతో తెలంగాణలో కిలోల చొప్పున పత్తి తీయడానికి వెళ్లిపోయారు. మండలంలో పనులు తగ్గుముఖం పట్టడం, ఉపాధి పనులకు పోతే వచ్చిన అరకొర వేతనం అదికూడా ఎప్పుడు వస్తుందో తెలీదు. దీంతో వలసలే శరణ్యం అనుకున్నారు. అందుకే రోజూ వందల సంఖ్యలో గ్రామాలను వదులుతున్నారు. ఎన్నికల ముందు నారా లోకేష్ యువగళంలో రాయలసీమలో వలసలను నిర్మూలిస్తామని చెప్పారు.. కానీ ఇప్పటి వరకు దాని ఊసే లేదు.

వలస బాటపట్టిన గ్రామాలు


వలస వెళ్తున్న గుడేకల్ గ్రామస్తులు

ఎమ్మిగనూరురూరల్: ఉపాధి కరువై గ్రామాల్లో ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు గ్రామీణులు వలస బాటపట్టారు. ప్రభుత్వం ప్రతి కుటుంబానికి ఉపాధి చూపిస్తామంటూ ఊపదంపుడు మాటలు తప్ప ఆచరణలో చూపించడం లేదు. గ్రామాల్లో ఒక్కరు వలస వెళ్లరాదు.. వలస వెళ్తే మీ సంగతి చెపుతా అంటూ ఈ మధ్య పల్లెపండుగ కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందిని ఉద్దేశించి ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి హెచ్చరించారు. ఎమ్మెల్యే మాటలు నీటిమాటలుగానే నిలిచాయి అనటానికి నిదర్శనం మంగళవారం మండల పరిధిలోని మసీదపురం, కందనాతి, గుడేకల్, ఏనుగుబాల గ్రామాలతో పాటు మరి కొన్ని గ్రామాల్లో ప్రజలు పిల్లాపాపలతో వలసబాట పట్టారు. ఊర్లో ఏమి పని ఉందని ఇక్కడ ఉండాలి మాకు ఉపాధినిచ్చే తెలంగాణ ప్రాంతానికి వలస వెళ్తున్నామంటున్నారు వలస వాసులు. పిల్లలను పాఠశాలలు మాన్పించి తమతో తీసుకెళ్తున్నారు. రోజూ వందల సంఖ్యలో వ్యాన్లు, ఆటోలు, రైళ్లలో ఇతర జిల్లాలకు ఉపాధి కోసం వలస వెళ్తున్నారు. మరో వారం ఉంటే గ్రామాలన్నీ ఖాళీ అయ్యే పరిస్థితి ఉందని గ్రామీణులు అంటున్నారు.

క్లుప్తంగా

అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండండి

ఎమ్మిగనూరురూరల్: అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని డీఎస్పీ ఉపేంద్ర బాబు సూచించారు. మంగళవారం తెల్లవారు జామున 5.30 గంటల ప్రాంతంలో పట్టణంలోని అబ్బాస్ థియేటర్ సమీపంలోని శాంతినగర్‌లో డీఎస్పీ ఆధ్వర్యంలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. కాలనీలో అన్ని ఇళ్లలో సోదాలు చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు అనుమానితుల ఇళ్లలో సోదాలు నిర్వహించి ఏమైన మారణాయుధాలు ఉన్నాయా, అక్రమ మద్యంతో పాటు ఇతర అసాంఘిక కార్యకలపాలు నిర్వహిస్తున్నారా అనేది తనికీ చేసినట్లు చెప్పారు. రౌడీషీటర్స్, ఇతర కేసుల్లో నిందితులుగా ఉన్న వారి కదలికపై నిఘా ఉంచుతామన్నారు. తనిఖీల్లో పట్టణ, మంత్రాలయం, కోసిగి, గోనెగండ్ల సీఐలు సుదర్శన్‌రెడ్డి, రామాంజున్, మంజునాథ్, గంగాధర్, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రతన్ టాటా గొప్ప వ్యాపారవేత్త


మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ మురళీ మోహన్

ఆదోని సెంట్రల్: రతన్ టాటా విజయవంతమైన వ్యాపారవేత్త అని ఆదోని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ మురళీమోహన్ కొనియాడారు. ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో రతన్ టాటా చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు రతన్‌టాటా జీవిత విశేషాలను తెలియజేశారు. భారత దేశానికి ఆయన చేసిన సేవలను వివరించారు. ఆయన విజయగాథలను స్ఫూర్తిగా తీసుకుని ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ప్రిన్సిపాల్ అయ్యప్ప, వైస్ ప్రిన్సిపాల్ బాలస్వామి, అధ్యాపకులు రామకృష్ణ, గోవిందు, నిఖిల్, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక


లాస్యను అభినందిస్తున్న ఉపాధ్యాయులు


ఆదోని సెంట్రల్: పట్టణంలోని పురపాలక ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని లాస్య రాష్ట్ర స్థాయి అండర్–14 ఫుట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం మల్లికార్జున తెలిపారు. మంగళవారం విద్యార్థిని లాస్యను అభినందించారు. వారు మాట్లాడుతూ ఈ నెల 24, 25 తేదీల్లో హిందూపురంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగే పోటీలలో పాల్గొంటుందని చెప్పారు. అలాగే జిల్లా స్థాయి అండర్–17 బ్యాడ్మింటన్ పోటీలకు గర్జప్ప, రామన్న ఎంపికైనట్లు వెల్లడించారు. వీరు నంద్యాలలో జరిగే జిల్లా స్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. కార్యక్రమములో వ్యాయమ ఉపాధ్యాయులు నరసయ్య, ముజాహిద్ బాషా, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వలసలను నివారించండి


ధర్నా చేస్తున్న సీపీఐ, ప్రజాసంఘాల నాయకులు

ఎమ్మిగనూరుటౌన్ : రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో వలసలు నివారించి ఉపాధి పనులు కల్పించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, మంత్రాలయం నాయకుడు భాస్కర్‌యాదవ్, ఏఐటీయూసీ తాలూకా కార్యదర్శి తిమ్మగురుడు డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ గ్రామీణులకు 200 రోజులు ఉపాధి పనులు కల్పించాలని, ఆర్డీఎస్ కుడికాలువ నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ, ప్రజా సంఘాల నాయకులు బజారి, దాదావలి, విరూపాక్షి నాయుడు, జబ్బార్, మాలిక్ తదితరులు పాల్గొన్నారు.

అనాథాశ్రమంలో అన్నదానం


అన్నం వడ్డిస్తున్న సీఐ సూర్యమోహన్‌రావు

ఆదోని అర్బన్: పట్టణంలోని జీవనజ్యోతి అనాథ ఆశ్రమంలో మంగళవారం ఆదోని టూటౌన్ సీఐ సూర్యమోహన్‌రావు అనాథలకు అన్నదానం చేశారు. సీఐ మాట్లాడుతూ తమ కుటుంబ సభ్యుల జన్మదినోత్సవం సందర్భంగా జీవనజ్యోతి అనాథ ఆశ్రమంలోని అనాథలు, వృద్ధులకు అన్నదానం, పండ్లు, బ్రెడ్లను అందించడం జరిగిందన్నారు. అనాథ ఆశ్రమాన్ని నిర్వహిస్తున్న విక్టర్‌పాల్ ఫిలిప్‌ను అభినందించారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు


మాట్లాడుతున్న ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్

ఆదోని రూరల్: సచివాలయ అధికారులు విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని కఠిన చర్యలు తప్పవని ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ హెచ్చరించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో 17 గ్రామ సచివాలయాలకు సంబంధించి 110 మంది సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన పల్లె పండగ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని సచివాలయ ఉద్యోగుల తీరును పరిశీలించారన్నారు. చాలామంది నిర్లక్ష్యంగా పని చేస్తున్నారని గుర్తించారని చెప్పారు. ఈ విషయం తనకు తెలియజేసి, వారిలో మార్పు తెచ్చే విధంగా చూడాలని ఆదేశాలు ఇచ్చారన్నారు. కొన్ని గ్రామాల్లో అయితే పింఛన్ల పంపిణీ ఆలస్యంగా, మరుసటి రోజు పింఛన్ అందిస్తున్నారని ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. ఆలస్యంగా పింఛన్లు పంపిణీ చేసే అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారన్నారు. ఇప్పటికైనా అప్రమత్తమై విధులను సక్రమంగా నిర్వర్తించుకోవాలని సూచించారు. సమావేశంలో ఈఓపీఆర్‌డీ జనార్దన్, పంచాయతీ కార్యదర్శి నాగరాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

లిఫ్ట్‌ను సద్వినియోగం చేసుకోండి

ఆదోని సెంట్రల్: ఆదోని రైల్వే స్టేషన్‌లో అమృత్ భారత్ కింద ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన లిఫ్ట్‌ను సద్వినియోగం చేసుకోవాలని రైల్వే స్టేషన్ మేనేజర్ వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం రైల్వే స్టేషన్‌లో లిఫ్టలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. స్టేషన్‌లో రూ. 30లక్షలు వెచ్చించి 3 లిఫ్టలను నిర్మించినట్లు వెల్లడించారు. వృద్ధులు, చిన్న పిల్లలు, వికలాంగులు, చంటి బిడ్డలు, గర్భిణులు వీటిని ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎలిక్ట్రీషియన్ మహమ్మద్ ఇర్ఫాన్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ వర్క్ తేజేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


లిఫ్టను ప్రారంభిస్తున్న రైల్వే స్టేషన్ మేనేజర్ వెంకటేశ్వర్లు

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం పూర్తి చేయాలి


కమిషనర్‌కు సమస్యలు వివరిస్తున్న వ్యాపారులు

ఆదోని టౌన్: పట్టణంలోని పాత బస్టాండు సర్కిల్‌లో మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం పనులను వెంటనే పూర్తి చేసి షాపులను కేటాయించాలని వ్యాపారులు శంకర్‌రావు, నవాజ్‌మనియార్, పటేల్, రాజు, సికిందర్‌తో పాటు మరి కొందరు మంగళవారం మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణకు వినతి పత్రాన్ని సమర్పించారు. షాపుల కోసం అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి గుడ్‌విల్ రూపంలో మున్సిపాలిటీకి చెల్లించామన్నారు. అయితే రెండేళ్లు గడుస్తున్నా తమకు షాపులు కేటాయించకపోవడంతో వడ్డీలు చెల్లించక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. పనును ప్రారంభించి రెండేళ్లవుతున్నా పునాది దశలో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు.

24న పీడీఎస్‌యూ అర్ధ శతాబ్దోత్సవం

ఆదోని సెంట్రల్: ఈ నెల 24వ తేదీన హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 5వ తేదీన విజయవాడలో జరిగే ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) అర్ధ శతాబ్దోత్సవ వేడుకలు జరగనున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు అఖండ తెలిపారు. మంగళవారం ప్రభుత్వ బాలికల కళాశాలలో విద్యార్థినులతో వేడుకల గోడ పత్రికలను విడుదల చేయించారు. కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పీడీఎస్‌యూ నాయకులు రసూల్, మల్లి, ఊశ్లేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్లను విడుదల చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

ఉద్యమాలతో విద్యావ్యవస్థ పటిష్టం

ఎమ్మిగనూరుటౌన్: ఉద్యమాలతో విద్యావ్యవస్థను పటిష్టం చేసుకోవాలని ఇందుకు, విద్యార్థులు సన్నద్ధం కావాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేంద్రబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు రామకృష్ణనాయుడు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక బాలికల హైస్కూల్ ఆవరణలో పీడీఎస్‌యూ అర్ధ శతాబ్దోత్సవ పోస్టర్లను విద్యార్థినులతో కలిసి ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ గురువారం హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలోని ఠాగూర్ ఆడిటోరియంలో, నవంబర్ 5న విజయవాడలో పీడీఎస్‌యూ అర్ధ శతాబ్దోత్సవ సభను నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఇంటర్ విద్యార్థినులు

ఆదోని సెంట్రల్: ఆదోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు అండర్–19 విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ వి. సంజన్న తెలిపారు. మంగళవారం ప్రతిభ చాటిన విద్యార్థినీలను అభినందించారు. వారు మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగే పోటీలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న రజని త్రోబాల్, మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థినులు పవిత్ర ఖోఖో, సునీత కబడ్డీ, లక్ష్మీ ఫుట్‌బాల్, సురేఖ బ్యాడ్మింటన్, ఇందు సాఫ్ట్‌బాల్, సౌమ్య త్రోబాల్, 100 మీటర్స్ రన్నింగ్ రేస్‌కు సెలెక్ట్ అయినట్లు వెల్లడించారు. క్రీడల్లో నైపుణ్యాలను పెంపొందించిన వ్యాయమ అధ్యాపకులు చిట్టి ప్రసాద్‌ను, విద్యార్థినులను అధ్యాపకులు, విద్యార్థులు పలువురు అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు గోవిందరాజులు, వేదావతి తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థినులను అభినందిస్తున్న అధ్యాపకులు

25న స్వర్ణామృత ప్రాసనం పంపిణీ

ఆదోని అర్బన్: ఈనెల 25న అవోపా, వామ్ ఆదోని వారి ఆధ్వర్యంలో 4వ విడత స్వర్ణామృత ప్రాసనం మందు పంపిణీ చేస్తున్నట్లు అవోపా అధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్‌గుప్తా తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎస్ఆర్ఐ కాకుబాళ్ నగేష్ సౌజన్యంతో శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్నజీయర్‌స్వామి ఆశీస్సులతో ఆదోని పట్టణంలోని అభయ ఆంజనేయస్వామి దేవస్థానంలో ఈ మందు పంపిణీ జరుగుతుందన్నారు. ఉదయం 7 గంటలకు కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. ఈ ఔషధం రోగ నిరోధకశక్తి, మేధాశక్తి, ఆయుష్షు, చర్మ సౌందర్యాన్ని పెంచడంతో పాటు మానసిక, శారీరక ఎదుగుదలను దోహదం చేస్తుందన్నారు. 9849478178 నంబర్‌కు కాల్ చేసి లేదా ఎస్ఎంఎస్ చేసి గానీ పిల్లల పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

25న జాబ్‌మేళా

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 25న ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మహబూబ్‌బాషా, జిల్లా స్కిల్‌డెవలప్‌మెంట్ అధికారి ఆనంద్‌రాజ్ కుమార్ మంగళవారం తెలిపారు. క్రెడిట్ ఆక్సిస్ గ్రామీణ్ లిమిటెడ్, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ లిమిటెడ్ కంపెనీలలో ఉద్యోగాల కోసం ఇంటర్, డిగ్రీ అర్హతలు కలిగిన అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు వివరాల కోసం సెల్ నంబర్ 8885904099కు సంప్రదించాలని కోరారు.

మున్సిపల్ కార్మికురాలిపై దాడి

ఆదోని అర్బన్: మున్సిపల్ కాంట్రాక్ట్ పారిశుద్ధ్య కార్మికురాలు నరసమ్మ మంగళవారం సాయంత్రం స్థానిక ఎంఐజీ కాలనీలో కసువు ఊడుస్తుండగా నలుగురు దాడి చేశారు. కింద పడిపోయిన నరసమ్మను స్థానికులు వెంటనే ఆదోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. గతంలో ఉన్న మనస్పర్థల కారణంగా చిన్నా, అశోక్‌తో పాటు మరో ఇద్దరు మహిళలు దాడి చేశారని బాధితురాలు త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

నేడు టిడ్కో లబ్ధిదారులతో ఎమ్మెల్యే సమావేశం

ఆదోనిటౌన్: ఆదోని పట్టణంలోని సిరుగుప్ప రహదారిలో ప్రభుత్వం నిర్మించిన టిడ్కో అపార్ట్‌మెంట్‌లో బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి ఆధ్వర్యంలో అన్నిశాఖల అధికారులు, టిడ్కో గృహాల లబ్ధిదారులతో సమావేశం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ మంగళవారం విలేకరులకు తెలిపారు. మొదటి విడత కింద తాళాలు పొందిన లబ్ధిదారులు పాల్గొని వారి సమస్యలను ఎమ్మెల్యే, అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే, అన్నిశాఖల అధికారులు కృషి చేస్తారని చెప్పారు.

అంతర్ మత సమ్మేళనానికి ఆహ్వానం


స్వామిజీని సత్కరిస్తున్న బిషప్ హెన్రీ డిసౌజా, ఫాదర్ ఇవాన్ పింటో

మంత్రాలయం: కర్ణాటకలోని బళ్లారి జిల్లా కేంద్రంలో జరుగు సర్వమత మత సమ్మేళనానికి రావాలని మంత్రాలయం శ్రీరాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులకు బళ్లారి జిల్లా బిషప్ హెన్రీ డిసౌజా, ఫాదర్ ఇవాన్‌పింటో ఆహ్వానం పలికారు. మంగళవారం మంత్రాలయం మఠంలో స్వామిజీని మర్యాద పూర్వకంగా కలిశారు. ఆహ్వాన ప్రతులను అందజేసి సత్కరించారు. స్వామిజీ ఫల, పూల మంత్రాక్షింతలు అందజేసి వారికి ఆశీర్వచనలు చేశారు.

బాలిక అదృశ్యం

కౌతాళం: మండల పరిధిలోని వల్లూరు గ్రామంలో బాలిక అదృశ్యమైనట్లు ఎస్ఐ మహమ్మద్ రిజ్వాన్ తెలిపారు. సోమవారం రాత్రి తల్లిదండ్రులు ఈరన్న, శాంతమ్మల పక్కనే పడుకుని ఉన్న స్వేత(17) రాత్రి 12 గంటల నుంచి కనిపించకుండ పోయింది. ఈ మేరకు తల్లి శాంతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వేధింపుల కేసు నమోదు

కౌతాళం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఉరుకుంద గ్రామానికి చెందిన దేవస్థానం అర్చకుడు లోక్‌రాజు తనను వేధిస్తున్నాడని అదే గ్రామానికి చెందిన లక్ష్మిని ఫిర్యాదు చేసిందని ఎస్ఐ మహమ్మద్ రిజ్వాన్ తెలిపారు. లక్ష్మితో లోక్‌రాజు అసభ్యకరంగా ప్రవర్తించడంతో పాటు లైంగికంగా వేధిస్తున్నాడని, మంగళవారం ఇంటికి వచ్చి దాడి చేసి కొట్టినట్లు లక్ష్మి ఫిర్యాదులో పేర్కొందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

భూ సమస్యలు పరిష్కరిస్తాం

పెద్దకడబూరు : రీ సర్వేలో తలెత్తిన భూ సమస్యలను గ్రామసభల ద్వారా పరిష్కరిస్తామని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అన్నారు. మండల పరిధిలోని చిన్న కడబూరు గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆయన పాల్గొని రైతుల నుంచి వినతులను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ గతంలో నిర్వహించిన భూ రీ సర్వేలో కొంతమంది రైతులకు సంబంధించిన భూములపై సమస్యలు ఉన్నాయన్నారు. అలాంటి వారి దరఖాస్తులు స్వీకరించి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు గీతాప్రియదర్శిని, మండల సర్వేయర్ తేజస్విని, తహసీల్దారు సిబ్బంది పాల్గొన్నారు.

ధణాపురంలో గ్రామసభ

ఆదోని రూరల్: మండలంలోని ధణాపురం గ్రామంలో ఆదోని డిప్యూటీ తహసీల్దార్ పెద్దయ్య గ్రామ సభ నిర్వహించారు. రైతులు తమ భూముల పట్ల అనుమానాలు, సరిహద్దులపై అభ్యంతరాలుంటే అర్జీల రూపంలో దరఖాస్తులు అందించాలన్నారు. వాటిని సరి చేస్తామన్నారు. ఇందులో ఇరువర్గాల రైతుల ఒప్పందం మేరకే జరుగుతుందని, ఎవరైనా ఒకరు ఒప్పుకోకపోతే కోర్టును ఆశ్రయించాల్సి ఉంటుందన్నారు.

గోనెగండ్ల : మండలంలోని ఐరన్‌బండ గ్రామంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరధ్వాజ్ పాల్గొన్నారు.


ఐరన్‌బండ గ్రామ సభలో అర్జీ స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

రైతుల సమస్యలను విని వారి నుంచి దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ శ్రీనివాసరాజు, డిప్యూటీ తహసీల్దార్ విష్ణుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా విద్యార్థులు చదువుకునే సమయంలో పాఠశాల ఆవరణలో రెవెన్యూ సదస్సు నిర్వహించడంపై రెవెన్యూ అధికారులపై సబ్ కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. చదువుకునే పిల్లలకు ఇబ్బంది కలిగించరాదని మీకు తెలియదా అని అధికారులపై మండిపడ్డారు.

ఇన్‌చార్జ్ సర్వేయర్‌కు షోకాజ్ నోటీసులు

ఐరన్‌బండ గ్రామంలో జరుగుతున్న రెవెన్యూ సదస్సుకు మండల ఇన్‌చార్జ్ సర్వేయర్ హాజరు కాకపోవడంతో సబ్ కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సదస్సులకు అధికారులందరూ హాజరుకావాల్సిందేనన్నారు. సర్వేయర్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేయనున్నట్లు తెలిపారు.

వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే


వివాహ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

కౌతాళం: మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి మంగళవారం పలు వివాహ వేడుకల్లో పాల్గొని వధూవరులను ఆశీర్వాదించారు. కౌతాళంలో వెలిసిన జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గా ధర్మకర్త (దర్గా తాత) మనవరాలి వివాహం ఆదోని జేబీ గార్డెన్‌లో జరిగింది. వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయనకు మండల నాయకులతో పాటు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చీస్తీ, గుల్షన్ కమిటీ అధ్యక్షుడు చిన్నమున్నపాషా, కర్ణాటకలోని సర్మస్‌వలి దర్గా నిర్వాహకుడు దూద్‌బాషా స్వాగతం పలికారు. అలాగే కౌతాళంలో జరిగిన పాత్రికేయుడు ఆరిఫ్ వివాహ రిసెప్షన్‌లో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట మండల కన్వీనర్ ప్రహల్లదచారి, సర్పంచ్ పాల్‌దినకర్, కోఆప్షన్ మెంబర్ మహబూబ్‌సాబ్, ఉప సర్పంచ్ తిక్కయ్య, మాజీ సర్పంచ్ అవతారం, నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పిస్తాం.. వలస వెళ్లొద్దు

పెద్దకడబూరు/కోసిగి: మీకు కావాల్సినన్ని ఉపాధి పనులు కల్పిస్తాం, వలసలు వెళ్లకండని ఏపీడీ లోకేశ్వర్ అన్నారు. మండల పరిధిలోని ముచ్చగిరి, పెద్దకడబూరు, కోసిగి మండలంలోని పలు గ్రామాలలో మంగళవారం ఆయన ఇంటింటికి తిరిగి ఉపాధి పనులపై ప్రజలకు అవగాహన కల్పించారు. కోసిగి మండలంలో ఉపాధి హామీ సిబ్బంది నాలుగు బృందాలు ఏర్పాడి అన్ని గ్రామాల్లో వలసలపై అవగాహన సభలను ఏర్పాటు చేసి వివరించారు. ఏపీడీ మాట్లాడుతూ.. వలసల వలన కుటుంబంలోని ప్రతి ఒక్కరూ ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి దాపురిస్తుందని వివరించారు. ఉన్న ఊర్లలోనే ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారు. ప్రతి ఒక్కరూ ఉపాధి పనులకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ జయరాముడు, ఈసీ లుఖాదర్‌బాషా, విజయరాజు ఏపీఓ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

గోనెగండ్ల : గ్రామాల్లోనే ఉపాధి హామీ పనులు కలిస్తాం ఎవరూ వలస వెళ్లొద్దని ఎంపీడీఓ మణి మంజరి సూచించారు. మంగళవారం మండల కేంద్రం గోనెగండ్లలోని ఎస్సీ కాలనీ మారెమ్మ దేవాలయం వద్ద కాలనీ వాసులకు ఉపాధి హామీ పనులపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ జాబ్ కార్డు కలిగిన వారందరికీ గ్రామంలోనే ఉపాధి హామీ పనులు కల్పిస్తామని తెలిపారు. 150 రోజుల పనిదినాలు ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ హైమావతి, ఏపీఓ మహబూబ్ బాషా, ఈఓఆర్డీ అనంతసేన, ఇన్‌చార్జ్ ఈఓ సతీష్ తదితరులు పాల్గొన్నారు.


ముచ్చగిరి గ్రామంలో ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పిస్తున్న ఏపీడీ లోకేశ్వర్

స్థలంపై కబ్జాపై విచారణ చేయండి

ఆదోని రూరల్: పర్వతాపురం మారెమ్మ దేవాలయం వద్ద కబ్జాకు గురైన స్థలంపై విచారణ చేయాలని రెవెన్యూ అధికారులను ఎమ్మెల్యే పార్థసారథి ఆదేశించారు. మంగళవారం శుక్రవారపేట ఎస్సీ కాలనీలో ఇంటింటికీ తిరిగి సమస్యలను తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏరియాలో పింఛన్లు లేని వారికి పింఛన్లు, ఇల్లు లేని వారికి ఇల్లు, నీటి కుళాయి లేని వారికి నీటి కుళాయి కనెక్షన్ అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

పశువులకు మేతగా పత్తి పంట


పత్తి పంటను తింటున్న గొర్రెలు

గోనెగండ్ల : ఈ ఏడాది పత్తి పంటకు గిట్టుబాటు ధర ఉన్నప్పటికీ వర్షాల కారణంగా పంటలు దెబ్బతిని రైతులకు నష్టం వాటిల్లింది. అకాల వర్షాల కారణంగా పండిన పత్తి నల్లగా మారడం, కాయలు మొలకెత్తడం, పురుగులు ఆశించడంతో కొందరు రైతులు పంటను దున్నేస్తుంటే మరికొందరు పశువులకు మేతగా వదిలేస్తున్నారు. గోనెగండ్లకు చెందిన ఇద్దరు రైతులు రాముడు, రెడ్డి సాగుచేసిన పత్తి పంట అధిక వర్షాలకు దెబ్బతినడంతో మంగళవారం గొర్రెలు, బర్రెలకు మేతగా వదిలారు. రూ.లక్షలు ఖర్చు చేసి చెరో ఎకరంలో సాగు చేసిన పంట పశువులకు మేతగా వదిలేయాల్సి రావడంతో రైతులు లబోదిబోమంటున్నారు.